AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
30-6-2026 (Tuesday)
MAIN EDITION

## సీఎంను కలిసిన నూతన సీఎస్ సంజయ్ జాజు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** తెలంగాణ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సంజయ్ జాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో కలిశారు. ఆయన వెంట ప్రస్తుత ప్రధాన కార్యదర్శి, సలహాదారు, సీఎం ఎక్స్అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా నియమితులైన కె.రామకృష్ణా రావు కూడా ఉన్నారు.

## ఈ20 పెట్రోల్‌పై కేంద్రం క్లారిటీ..

**అక్షరటుడే, ఢిల్లీ:** దేశవ్యాప్తంగా పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలిపే (ఈ20) కార్యక్రమం ప్రస్తుతం ప్రయోగాత్మక దశలోనే ఉందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. వాహనాల పనితీరు తగ్గడం, మైలేజీపై వస్తున్న ఆందోళనల నేపథ్యంలో, వచ్చే ఏడాది నాటికి దీని ఫలితాలు, ప్రభావం స్పష్టంగా తెలుస్తాయని స్పష్టం చేసింది. ఇథనాల్ సరఫరా ఒప్పందాల విషయంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తమ కొనుగోళ్లను తగ్గించడాన్ని సవాలు చేస్తూ డిస్టిలరీ కంపెనీలు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించాయి. దీనిపై సరఫరాదారులకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఇవ్వగా, ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రభుత్వ రంగ చమురు సంస్థ 'బీపీసీఎల్' సుప్రీంను ఆశ్రయించింది.

## సైన్యాధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత సైన్యాధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ చేయడంతో, ఆ బాధ్యతలను ధీరజ్ సేథ్ చేపట్టారు. దేశ 31వ ఆర్మీ చీఫ్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ అత్యున్నత పదవిని చేపట్టకముందు, ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా సేవలందించారు.

## హెచ్‌సీయూలో కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హెచ్‌సీయూలో కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. కాంట్రాక్ట్ కార్మికులు తమ దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలని హెచ్‌సీయూ పరిపాలనా విభాగం ఎదుట మరోసారి నిరసనకు దిగారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక చట్టాల వల్ల తాము సంక్షోభంలో కూరుకుపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

## విశాఖపట్నంకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**అక్షరటుడే, అమరావతి:** భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చారు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి మంగళవారం విశాఖపట్నం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు.

## సింధు జలాలపై పాక్ మంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్ సింధు జలాలను అడ్డుకోవడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ క్రమంలో ఆ దేశ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. సింధు జలాల ఒప్పందం ప్రకారం ఇస్లామాబాద్‌కు దక్కాల్సిన నీటి వాటాను కోరే వారి "చేతులను నరికేస్తామని" పాకిస్థాన్ వాతావరణ మార్పుల శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపేసిన విషయం తెలిసిందే. విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాలిక్, పాకిస్థాన్ నీటి వాటాను భారత్ "నియంత్రిస్తోందని" ఆరోపించారు. తమ నీటి వాటాకు అడ్డుపడే వారిని తాము "ఎవరినీ వదిలిపెట్టబోమని" ఆయన పేర్కొన్నారు. పొరుగు దేశ ప్రధాని చేతిలో ఒక కుళాయి నియంత్రణ ఉందని మోదీని ఉద్దే

## సిగాచి బాధితులను మోసం చేసిన ప్రభుత్వం : హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** సిగాచి పరిశ్రమలో పేలుడు కారణంగా చనిపోయిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈ ఘటన జరిగి నేటికి ఏడాది అవుతున్న సందర్భంగా ఆయన 'ఎక్స్' వేదిక పోస్ట్ చేశారు. ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి కంపెనీ నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు హరీశ్‌రావు నివాళి తెలిపారు. ఈ ప్రమాదంలో 54 మంది చనిపోయారని, మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇస్తామని సీఎం ప్రకటించారని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం తరఫున రూ.లక్ష మాత్రమే ఇచ్చారన్నారు. కంపెనీ ఇచ్చిన డబ్బులు బాధిత కుటుంబాలకు ముట్టజెప్పి, కోటి పరిహారం నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు.



తెలంగాణను కాంగ్రెస్ పార్టీ తన 'ఢిల్లీ దర్బార్'కు ఏటీఎంలా మార్చుకుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మల్కాజ్ గిరిలోని ఔషాపూర్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు.

- అక్షరటుడే, హైదరాబాద్

# రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్

■ తెలంగాణను ఏటీఎంలా వాడుకుంటున్న కాంగ్రెస్ ■ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ■ పార్టీ బలోపేతంపై నాయకులకు దిశానిర్దేశం

రాష్ట్రంలో 'ఆర్ఆర్ టాక్స్' వసూలు చేస్తూ, ఆ సొమ్మును ఢిల్లీకి తరలిస్తున్నారని, తెలంగాణను కాంగ్రెస్ అధిష్టానానికి ఏటీఎంలా మార్చేశారని నితిన్ నబీన్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయలేదని, అవినీతి, నేరాలతో కూడిన పాలనను సాగిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలు ఒకే బాటలో పయనిస్తున్నాయని, బడుగు బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు.

### కార్యకర్తలకు పిలుపు..

మోదీ నాయకత్వంలోని పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పశ్చిమబెంగాల్ విజయం కార్యకర్తల కష్టంతోనే సాధ్యమైందని, అదే స్ఫూర్తితో తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, మోదీ నాయకత్వంలో ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని నితిన్ నబీన్ ధీమా వ్యక్తం చేశారు.

### మాట నిలబెట్టుకుంటాం

దేశవ్యాప్తంగా ప్రస్తుతం 22 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని నితిన్ నబీన్ అన్నారు. ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వంతో కలిసి ముందుకు సాగడానికి సిద్ధంగా ఉండటమే దీనికి కారణం అన్నారు. తాము ఇచ్చిన మాట నిలబెట్టు కుంటామని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం తెలంగాణ కోసం కూడా కృషి చేస్తోందన్నారు. దేశంలో 12 ఏళ్లలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ఎస్ఐఆర్‌పై బీజేపీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

## రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టిన ప్రభుత్వం



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. 30 నెలల కాంగ్రెస్ పాలనలో దాదాపు రూ. 30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడడానికి సిగ్గు అనిపిస్తలేదా అని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టారు. రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే.. పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం అవివేకమన్నారు.

## 9 రోజుల్లో 'రైతు భరోసా' పూర్తి : మంత్రి పొన్నం



**అక్షరటుడే, సిద్దిపేట :** రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి రైతు భరోసా నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తాము ఆలస్యంగా రైతు భరోసా వేస్తున్నామని బీఆర్ఎస్ విమర్శించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 201819లో వర్షాకాలంలో మొదటి సారి రైతు బంధు రూ.4 వేల చొప్పున బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. అప్పుడు చెక్కులు ఇచ్చారని, అనంతరం ఎన్నికలు కావడంతో నేరుగా ఖాతాల్లో జమ చేశారన్నారు. అప్పుడు రైతుబంధు పూర్తి చేయడానికి 4 నెలల 5 రోజులు సమయం పట్టిందని పేర్కొన్నారు. 2021లో 5 నెలల 11 రోజులు పట్టిందని తెలిపారు. 202122లో రింగ్ రోడ్డును 30 సంవత్సరాలకు అమ్మి ఆ పైసలతో రైతుబంధు వేశారని గుర్తు చేశారు.

## హైదరాబాద్‌లో భారీ పేలుడు.. ఇల్లు ధ్వంసం




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్‌లో ఓ ఇంట్లో భారీ పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇల్లు పూర్తిగ ధ్వంసం అయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బాబూనగర్‌లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ ఇంట్లో మంగళవారం ఉదయం భారీ పేలుడు సంభవించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే ఉన్నప్పటికీ, అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లోని మూడు గ్యాస్ సిలిండర్లు పేలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో ఇల్లు ధ్వంసం అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఓటు పోతే.. పథకాలు అందవు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కర్ణాటకలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైంది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సదాశివనగర్‌లోని తన నివాసంలో ప్రారంభించారు. ఎన్నికల సంఘం అధికారులు ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేయగా.. ఆయన దానిని పూర్తి చేసి సమర్పించి, ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి మొదటి ప్రతినిధిగా, ఎస్ఐఆర్ నేడు తన ఇంటి నుంచే ప్రారంభమైందన్నారు. ఫారంలో వివరాలు నింపడం కష్టంగా అనిపించిందని పేర్కొన్నారు. ప్రజలు ఈ ఫారాన్ని జూలై 29వ తేదీలోగా పూరించి సమర్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు పోతే ప్రభుత్వ పథకాలు అందడం కష్టమవుతుందన్నారు.

## యాదగిరిగుట్టలో తిరుమల విధానం..



**అక్షరటుడే, హైదరాబాద్:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మరింత వైభవోపేతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఈ క్రమంలో టీటీడీ అనుసరిస్తున్న భూ కేటాయింపులు, ఆలయ నిర్వహణ విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎంసీహెచ్ఆర్డీలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. భవిష్యత్తులో ఎవరికి భూములు కేటాయించినా, ఆ స్థలం పూర్తి యాజమాన్య హక్కులు ఆలయ బోర్డు వద్దే ఉండాలని సీఎం స్పష్టం చేశారు. మఠాలు, కుల సంఘాలకు భూముల కేటాయింపు విషయంలో పారదర్శకమైన నిబంధనలతో కూడిన ఒక శాశ్వత విధానాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు.

## అస్సాంలో వర్ష బీభత్సం.. భారీ నష్టం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయిన నేపథ్యంలో వరద పరిస్థితిని, నష్టాన్ని సమీక్షించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు వరదలతో అతలాకుతలమైన రాష్ట్రాలకు కేంద్రం నుంచి అన్ని విధాలా సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ధేమాజీలో సోమవారం భారీ వర్షాల కారణంగా జోనైలోని లోతట్టు ప్రాంతాలు, గ్రామాలు వరద నీటితో మునిగిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు అరుణాచల్ ప్రదేశ్‌లోని కనీసం 12 జిల్లాలను అతలాకుతలం చేయగా, అస్సాంలోని ఐదు జిల్లాల్లో దాదాపు 45,000 మంది ప్రజలు ప్రభావితులయ్యారు. దిగువ దిబాంగ్ వ్యాలీ జిల్లాలోని సిసిరి నదిలో ఒక ద్వీపంలో నలుగురు చిక్కుకుపోవడంతో భారత వైమానిక దళం వారిని రక్షించింది.